క్లుప్తంగా

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడులో సోమవారం ఉదయం 11గంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎస్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు, విద్యార్థులు, ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వారికి అవసరమైన అర్జీలను పెట్టుకోవచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 2గంటలకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలో అన్ని గ్రామాలకు చెందిన వీఆర్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మణిపూర్ బాధితులకు బాసటగా నిలుద్దాం

చీరాల రూరల్: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్ల కారణంగా అక్కడ నివాసముంటున్న క్రైస్తవుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని తక్షణమే వారిని ఆదుకోవాలని విశాఖపట్టణానికి చెందిన ఓటీసీసీ వ్యవస్థాపకుడు బ్రదర్ హనీ జాన్సన్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో మణిపూర్ బాధితుల సహాయార్థం ఆర్థిక సహకారం కోరుతూ ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రదర్ హనీజాన్సన్ దేవుని వాక్య సందేశం అందించారు. ముందుగా సంఘ కాపరులు కొమ్మిన జోసఫ్ కేరి, పిల్లి దేవదాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ యెరిచర్ల రమేష్ బాబు, పీసీసీ, ఎల్‌సీసీ సభ్యులు, యూత్, పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): మణిపూర్ ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని పలు క్రైస్తవ మహిళా సంఘాలు ఆరోపించాయి. ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పర్చూరులో ఆదివారం పలు క్రైస్తవ మహిళా సంఘాలు ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ జరిగింది. మణిపూర్ బాధ్యులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు వడ్డిముక్కల అబ్రహం, నలిగల కిషోర్, జూపూడి రోశయ్య, కంభం మార్కు, జూపూడి మార్కు, గేరా స్వరాజ్ కుమార్, మత్తె డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సత్యమార్గంలో నడవాలి



ప్రవచనం చేస్తున్న శ్రీనివాసులు

చీరాల రూరల్: ఆధ్మాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక లయన్స్ క్లబ్ సర్వీసెస్ బిల్డింగులో నిర్వహించిన ఆధ్యాత్మిక భక్తి ప్రవచనాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు ఈ ఆధ్యాత్మిక ప్రవచనాలలో చంద్రశేఖర సరస్వతి, మహాస్వామి జీవితం-లీలలపై ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ సత్యమార్గంలో నడవాలని, ధర్మాన్ని పాటించాలన్నారు. కార్యక్రమానికి ముందుగా బతుకమ్మ, అష్టలక్ష్మి సమాజం వారు సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో పీఠం అధ్యక్షుడు వెంకట్రావు, సెక్రటరీ లయన్ ఎంఎస్. ప్రసాదరావు, ట్రెజరర్ డాక్టర్ ఎం. వెంకట్రావు, పచ్చిపులుసు లక్ష్మయ్య, జరీ నాగేశ్వరరావు, సహజ సాహితి అధ్యక్షుడు వడలి రాధాకృష్ణ, శాస్త్రీయ సంగీత విద్వాంసులు కృష్ణమూర్తి, బత్తుల బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పాత మల్లాయపాలెంలో జగనన్న కాలనీ లే అవుట్



పూర్తయిన ఇంటిని పరిశీలిస్తున్న అప్పటి కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు (ఫైల్)



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణ (ఫైల్)

పేదల హృదయాలయాలు

- 13 లే అవుట్లలో 239 ఇళ్లు మంజూరు
- సొంత స్థలాలకు 419 ఇళ్లు మంజూరు, 259 పూర్తి
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

బల్లికురవ: జీవితంలో ఇల్లు కట్టుకోవడం ప్రతి ఒక్కరి కల. కూడు గూడు, గుడ్డ ప్రతి మనిషికీ కావాల్సిందే. ఎన్నో సంవత్సరాలుగా ఇల్లు లేక అవస్థలు పడుతున్న పేదల కల జగనన్న కాలనీ లే అవుట్, సొంత స్థలాల్లో నెరవేరుతోంది. ఒక్కో లే అవుట్‌లో 20 నుంచి 30 గృహాలు నిర్మాణంతో జగనన్న కాలనీల పేరిట ఊళ్లే వెలుస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు, పక్కా ఇల్లు మంజూరుకు కోట్లాది రూపాయలు ఖర్చుతో భూములు కొనుగోలు చేసి లే అవుట్లు వేశారు. స్థలంతోపాటు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షల నగదుతోపాటు, నాలుగు ట్రక్కుల ఇసుక, ప్రభుత్వ ధరకు 90 బస్తాల సిమెంటు 582 కిలోల ఇనుము, ఇంకుడు గుంటకు ఆరు వేలు అందిస్తున్నారు. జగనన్న చేయూతతో తామంతా ఇళ్లు నిర్మించుకుంటున్నామని, గ్రామాల వారీగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సొంత స్థలాల్లో 419 ఇళ్లు మంజూరు కాగా 259 పూర్తయ్యాయి. 350 వరకు వివిధ దశల్లో ఉన్నాయి. పీఎం ఏవైలో 468 ఇళ్లు మంజూరయ్యాయి.



బల్లికురవలో నిర్మాణం పూర్తయిన గృహం

హౌసింగ్‌డేలో అవగాహన సదస్సులు..

ప్రతి శనివారం హౌసింగ్ డే సందర్భంగా ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారుల బృందం ఎంపిక చేసుకున్న జగనన్న కాలనీ లే అవుట్‌కు వెళ్లి లబ్ధిదారులకు ఇంటి నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్నారు. అవగాహనతో ఇళ్ల నిర్మాణాలు మండలంలో చురుకుగా సాగుతున్నాయి. ఆగస్టు 15 తరువాత గృహ ప్రవేశాలు చేసేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం..



ఈమె పేరు మల్లేశ్వరి వైదన గ్రామం. ఇప్పటి వరకు మల్లేశ్వరితో పాటు ఆమె భర్త, నలుగురు పిల్లలు రోడ్డు మార్జిన్‌లో డేరా గుడిసె వేసుకుని నివశిస్తున్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామంలో వేసిన జగనన్న లే అవుట్‌లో స్థలం కోసం అర్జీ పెట్టుకున్నారు. మంజూరు కావడంతో అందులో ఇంటిని ప్రభుత్వ ఇచ్చిన నగదు మెటీరియల్‌తో నిర్మించుకుంటున్నారు. కొద్ది రోజుల్లో ఆ ఇంటిలో చేరనుండడంతో వారి బాధలు తొలగనున్నాయి. దీంతో వారు తమకు ఇంటి కల నెరవేర్చిన జగనన్నకు రుణపడి ఉంటామని చెప్తున్నారు.

మూడు దశాబ్దాల తర్వాత నెరవేరిన ఇంటి కల



కోటేశ్వరరావు స్వగ్రామం వినుకొండ దగ్గర చెట్టుపల్లి గ్రామం. మూడు దశాబ్దాల క్రితం బల్లికురవ మండలం బల్లికువరవలోని అత్తగారింటి వద్దకు వచ్చి ఉంటున్నాడు. ఉన్న ఊరిలో, ఉంటున్న ఊరిలోనూ సొంత ఇల్లు లేదు. అద్దె చెల్లించి అద్దె ఇంట్లో ఉంటూ సంపాదించిన డబ్బు అద్దెకే అంతంత మాత్రం అవుతోందని బాధపడేవారు. తమ గోడు ఎవరూ పట్టించుకోలేదు. అయితే జగనన్న ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇంటి స్థలం వచ్చింది. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని అందులో చేరి ఆనందంగా ఉన్నారు. నా ఇంటిని అప్పటి కలెక్టర్ చూసి ఇంత బాగా ఎలా కట్టుకున్నావని ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

తోపుల్లో ఉండే వారికీ ఇల్లు..



నా పేరు చూవూరి సుబ్బాయమ్మ. మేము గిరిజనులం. కొత్తమల్లాయపాలెం గ్రామంలోని కొండ ప్రక్కన తోపులో గుడిసె వేసుకుని నివాసం ఉండేవాళ్లం. మాకు ఏపీ శాప్‌నెట్ చైర్మన్ వైఎస్సార్ సీపీ కృష్ణ చైతన్యకు వారి గోడు చెప్పుకోగా, వారికి ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేశారు. ఇల్లు నిర్మించుకుంటున్నారు. కొద్దిరోజుల్లో ఆ ఇంటిలో సుఖంగా ఉండబోతున్నారు. దీంతో వారి బాధలు తీరనున్నాయి.

లే అవుట్ల వివరాలు..		
గ్రామం	మంజూరైన ఇళ్లు	నిర్మాణంలో ఉన్నవి
బల్లికురవ	20	15
వైదన	20	20
పెద అంబడిపూడి	21	20
చెన్నుపల్లి	28	24
గుంటుపల్లి	12	11
కొప్పరపాడు	24	19
కూకట్లపల్లి	08	01
ముక్తేశ్వరం	07	02
నక్కబొక్కలపాడు	30	20
పాతమల్లాయపాలెం	29	27
ఎస్‌ఎల్ గుడిపాడు	03	02
ఉప్పమాగులూరు	31	19
వేమవరం	06	02
మొత్తం	239	182

వృద్ధాప్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుభాషిణి

చీరాల అర్బన్: వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించాలని చీరాల ఏరియా వైద్యశాల సూపరిండెంటెండ్ పి.సుభాషిణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చీరాల శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం చీరాల ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుభాషిణి హాజరై సలహాలు, సూచనలు అందించారు. నేడు చీరాల ఏరియా వైద్యశాలలో అన్ని విభాగాలకు సంబంధించిన డాక్టర్లను ప్రభుత్వం నియమించిందని, ఆరోగ్య పరీక్షలు చేయడానికి అవసరమైన నూతన పరికరాలు ప్రభుత్వం సమకూర్చిందన్నారు. కార్యక్రమానికి యస్.యల్లమందారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కట్టా రాజ్‌వినయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగవీరభద్రాచారి, కార్యదర్శి రామారావు, శివప్రసాద్, మునీరుల్లాఖాన్, వి.జగన్‌మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి సాయం

చినగంజాం: యాచన చేస్తున్న దివ్యాంగురాలికి దాత ఆర్థిక సాయం అందించారు. ఆదివారం సోపిరాల గేట్ సెంటర్‌లోని తన సిమెంట్ కార్ఖానా వద్ద యాచకురాలు యశోదకు దాత గండి పుల్లమ్మ రూ 2500 నగదు, నిత్యావసర సరుకులు, కూరగాయలు అందించారు. యశోదకు ఐదు, మూడు సంవత్సరాలు కలిగిన ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, తన భర్త పిల్లలు పుట్టిన తరువాత తనను వదలి వెళ్లిపోయాడని తెలిపిందన్నారు. ఎవరైనా ఆర్థిక సాయమందిస్తే బడ్డీ కొట్టు పెట్టుకొని గౌరవంగా కుటుంబాన్ని పోషించుకుంటానని ఆమె చెప్పింది. దాంతో ప్రస్తుతం తాను ఆర్థిక సాయమందించానని, ఆమె కొట్టు పెట్టుకునేందుకు కూడా ఆర్థిక సాయమందించనున్నట్లు పుల్లమ్మ దాత తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది కట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం.. శాశ్వతం



భూమి పూజ చేస్తున్న రోటరీ సభ్యులు

ఇంకొల్లు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ సభ్యులైన సోమేపల్లి రామ్మోహనరావు, వత్సవాయి రాఘవ రాజుల ఆర్థిక సహకారంతో ఇంకొల్లు స్థూపం సెంటర్ వద్ద ట్రాఫిక్ పోలీస్ పోస్టును నిర్మాణం చేసేందుకు భూమి పూజ నిర్వహించారు. పూజ అనంతరం స్నేహితుల దినోత్సవ సందర్భంగా సభ్యులందరూ ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వర్లు, సభ్యులు రాఘవ రాజు, మద్దినేని హనుమంతరావు, పేర్ని సత్యనారాయణ, నిమ్మగడ్డ హనుమంతరావు, బెల్లం కొండ వాసుదేవరావు, భవనం అంజిరెడ్డి, అర్కిటెక్ నాగేంద్ర బాబు, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

దత్తక్షేత్రం ప్రహరీకి ఆర్థిక సాయం



చెక్కును ఆలయ కమిటీ కన్వీనర్‌కి అందిస్తున్న దాత

వేటపాలెం: చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో గల దత్తక్షేత్రం ప్రహరీ నిర్మాణం కోసం చెరుకూరి వంశీ, జాంబియా రూ.1 లక్ష విరాళం చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ కన్వీనర్ కే ప్రమీలదేవి మాట్లాడుతూ దత్తక్షేత్రం గోడ నిర్మాణానికి అనేక మంది దాతలు స్పందిస్తున్నారని అన్నారు. మరో దాత చెరుకూరి రాంబాబు, శ్యాం బాబులు రూ. 50,116, అభినవ్, సాకేత్‌లు రూ. 15,115, గట్టా నరేంద్ర కుమార్, బుచ్చయ్యలు రూ. 15,116 అందజేసినట్లు తెలిపారు. దాతలు అందించిన ఆర్థిక సహకారంతో త్వరలో ప్రహరీ నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు ఉన్నారు.

బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సంతమాగులూరు (అద్దంకి): బావిలో కుళ్లిపోయిన స్థితిలో ఓవ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈఘటన సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో ఆదివారం వెలుగుచూసింది. అందిన వివరాల మేరకు.. గ్రామంలోని పాడుబడిన బావిలో మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి వివరాలు సేకరిస్తున్నారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటకు తరలించారు.

వైభవంగా పోలేరమ్మ కొలుపులు



కొలుపుల్లో అమ్మవారి చిత్రపటం

కారంచేడు: ప్రతి ఏటా సాగుకు ముందు గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి కొలుపులు నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందుగా కారంచేడు గండిబజారుకు చెందిన కొలుపులను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల కోలాటంతో గ్రామంలో పెద్ద ఎత్తున సంబరం నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి తలంటు స్నానాలు ఆచరించి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గ్రామ దేవతను ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. యువతీ, యువకులు వీరతాళ్లతో అమ్మవారి ప్రతిమకు ముందు నృత్యాలు చేశారు. గ్రామంలోని భక్తులు, రైతులు, పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు పోలేరమ్మ తల్లి కొలుపుల్లో పాల్గొన్నారు.

చంద్రబాబుది నీచ రాజకీయం

- విద్వేషాలు రెచ్చగొడుతున్న చంద్రబాబు
- ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని హితవు
- చంద్రబాబుపై ఆమంచి ఫైర్



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): టీడీపీ అధినేత చంద్రబాబుపై పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ధ్వజమెత్తారు. ఇటీవల ప్రాజెక్టుల పేరుతో పులివెందుల, పుంగనూరు ప్రాంతాల్లో చంద్రబాబు సృష్టించిన అలజడి గురించి ఆయన ప్రస్తావించారు. ఆదివారం పర్చూరు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల సందర్శన పేరుతో చంద్రబాబు అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. పర్యటనకు ముందు చంద్రబాబు ఏం చెప్పాడో తరువాత ఏ చేశాడో ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని చంద్రబాబుకు హితవు పలికారు. ప్రజల మనోభావాలను రెచ్చగొట్టి మీడియాని అడ్డు పెట్టుకొని అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు భాష, హావాభావాలు వయస్సుకు తగ్గట్టు లేవని ఆయన ఎద్దేవా చేశారు. పోలీసులపై దాడి చేసిన వారిని గాయపరచి వారిపైనే నిందలు వేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు చుట్టూ ఎన్‌ఎస్‌జీ కమాండోలు, 350 మంది పోలీసులు ఉంటే అతని దగ్గరికి వెళ్ల సాహసం ఎవరైనా చేస్తారా? అని ఆమంచి ప్రశ్నించారు. జగన్ తలచుకుంటే చంద్రబాబు పులివెందులలో తిరిగేవాడో కాదో అయనే ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. చంద్రబాబు చెప్పే అసత్యాలను ఎవరూ నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు.

దొంగ ఓట్లను గుర్తించాలి..

పార్టీ కార్యాలయంలో ఇంకొల్లు, మార్టూరు మండలాల కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. పర్చూరు నియోజక వర్గ ఓటర్ల జాబితాలో నమోదైన దొంగ ఓట్లను గుర్తించి వాటి సమాచారాన్ని స్థానిక బూత్ లెవెల్ అధికారులకు అందించాలని సూచించారు. గ్రామాలవారీగా పెళ్లయి వెళ్లిన మహిళలు, చనిపోయిన వారి వివరాలు, ఇతర రాష్ట్రాలు, దేశాలు, పట్టణాలలో నివాసముండే వారి వివరాలు సేకరించి బీఎల్‌ఓలకు ఇవ్వాలన్నారు. దొంగ ఓట్లను ప్రోత్సహించవద్దని ఆయన సూచించారు. బీఎల్‌ఓలు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిజాయితీగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. అనంతరం మండలంలోని అన్నంబొట్ల వారిపాలెంలో జరుగుతున్న ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు ప్రక్రియను పరిశీలించి 153, 154 పోలింగ్ కేంద్రాలలో 260 దొంగ ఓట్లను గుర్తించినట్లు వాటిని తొలగించే ప్రక్రియ చేపట్టాలని బీఎల్‌ఓలకు సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కఠారి అప్పారావు, తోకల కృష్ణ మోహన్, ముప్పాళ్ల రాఘవ, గోరంట్ల శివకుమారి, తులసి నాగమణి, జంగా అనిల్, ఆకుల హేమంత్, లంకా శివ, అడపా సుధాకరరెడ్డి, గాద సురేష్,. చిన్ని తదితరులు పాల్గొన్నారు.

చుండూరు అమరవీరులకు జోహార్లు



ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మార్టూరు: పెత్తందార్ల అహంకారానికి 32 ఏళ్ల క్రితం అశువులు బాసిన చుండూరు అమర వీరులకు ఆదివారం మార్టూరులో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గన్నవరం రోడ్డులో ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సమతా సైనిక దళ కన్వీనర్ బొల్లాపల్లి బెంజిమన్,ఓపీడీఆర్ బాషా తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఖాదర్ వలి, సుజాత, విజయకుమారి, బీక్షాలు, స్వామి, అంజి, యిర్మియా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

వేటపాలెం: మండల పరిధిలోని రామన్నపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలకు దాత పాటి బండ్ల కోటేశ్వరరావు దంపతులు రూ. 30 వేలు విరాళం అందించారని ఈవో జీవీఎల్ కుమార్ ఆదివారం తెలిపారు. దాత కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు. గతంలో ఆలయ ప్రాంగణలో నిర్మించిన వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం, భక్తుల వసతి గృహాలకు ఫ్యాన్ల ఏర్పాటుకు విరాళం అందించినట్లు ఈవో తెలిపారు. అనంతరం దాత దంపతులను ఈవో సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీరాల టౌన్: నేడు సోమవారం చీరాల- వేటపాలెం 132/33కేవి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఉపకేంద్రం పరిధిలోని వేటపాలెం, చినగంజాం మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చీరాల డీఈ శ్రీ టీ. శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే చీరాల టౌన్, గ్రామీణ ప్రాంతాల్లో పాక్షికంగాను ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 3.00 వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చేనేత దినోత్సవం సందర్భంగా ర్యాలీ

చీరాల టౌన్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేటి సోమవారం ఉదయం 9 గంటలకు చీరాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీ ఉంటుందని జిల్లా చేనేత చేనేత శాఖ ఏడీ జే రాజవర్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత సంఘాలు, కార్మికులు హాజరవుతారని తెలిపారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.